

కని'బెట్'కుని ఉండాలి..

బెట్టింగ్ భూతం భయపెడుతోంది. ఇంటిలో యువతను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాల్సిన సమయమిది. - 10లో



చెరువులో మృతదేహం

మూడు రోజుల కిందట అదృశ్యమైన వృద్ధురాలు చెరువులో శవమై తేలింది. సింగన్నపాలెం చెరువులో మృతదేహం దొరికింది. - 10లో

నేడు అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: సహిత విద్య భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పీఐ/హెచ్ఐ, ఎంఆర్ పోస్టులకు సంబంధించి మెరిట్ లిస్టును డీఈఓ శ్రీకాకుళం అధికారిక వెబ్‌పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్టు సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ చెప్పారు. మెరిట్ లిస్టుపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా.. బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయానికి వచ్చి లిఖితపూర్వకంగా గానీ, ఆన్‌లైన్‌లో గాని తెలియజేయవచ్చని చెప్పారు. వివరాలకు 94924 20186 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

న్యూస్‌రీల్

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలోని స్కిల్ కాలేజ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ చెప్పారు. స్కిల్ కాలేజ్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. డిగ్రీ, పీజీ పూర్తిచేసిన యువత అర్హులు కాగా, ఈ నెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని, 25 నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు చెప్పారు. పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సు (మూడు నెలలు)కు అర్హత డిగ్రీ కాగా, 20 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సువారు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు, భోజన, వసతులు ఉచితంగా కల్పించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 8247656581, 7680945357 సంప్రదించాలని సూచించారు.

ముగిసిన ధర్మ ప్రచార వారోత్సవాలు



అనివేటి మండపంలో విష్ణు సహస్ర పారాయణ జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ధర్మప్రచార వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 4 నుంచి 10 వరకు దేవదాయ శాఖ, ధర్మప్రచార పరిషత్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన ఈ వారోత్సవాలకు మంచి స్పందన వచ్చింది. మంగళవారం ఉదయం నుంచి త్రిచ, సౌర, అరుణ ప్రయుక్త సూర్యనమస్కారాలు, వేదపారాయణ, గోపూజ తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఆలయ ఈఓ వి.హరిసూర్య ప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యురాలు ద్వారపు అనూరాధ సమక్షంలో శ్రీవెంకటేశ్వర భక్త మండలి అధ్యక్షురాలు ఎల్.గిరిజారాణి ఆధ్వర్యంలో శ్రీవిష్ణు సహస్రనామార్చన, స్తోత్ర పారాయణ కార్యక్రమం అనివేటి మండపంలో జరిగింది. సుమారు 108 మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఒకేసారి విష్ణు సహస్రనామార్చనలు చేయడం ప్రత్యేకంగా కనిపించింది.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో లక్ష్మికి బంగారు పతకం

ఆమదాలవలస: జాతీయ స్థాయి యోగా పోటీల్లో ఆమదాలవలస పట్టణం కాలేజీ వీధికి చెందిన లగుడు లక్ష్మి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం దేవన్‌గేరిలో ఈ నెల 8వ తేదీన సప్తరుషి యోగా ధర స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 60 ఏళ్ల పైబడిన మహిళల విభాగంలో జరిగిన యోగా జాతీయ స్థాయి యోగా పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 12 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో లగుడు లక్ష్మి తన ప్రతిభతో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు.

పుట్ట గొడుగుల పెంపకంతో ఆదాయం



పుట్టగొడుగుల శిక్షణ కార్యక్రమంలో సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త సునీత

ఆమదాలవలస: పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత తెలిపారు. పట్టణంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టగొడుగుల్లో మంచి పోషకాలతో కూడిన ఆహారం, అందులో మాంసకృత్తులు, నీరు పొటాషియం, మాంగనీసు లభ్యమవుతాయని తెలిపారు. పుట్టగొడుగు పెంపకంలో శిక్షణ తీసుకుని మెలకువలు పాటిస్తే చాలా లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. దీని వల్ల యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. పుట్టగొడుగుల్లో వివిధ విలువాధారిత ఉత్పత్తులు తయారు చేయవచ్చునని, మార్కెట్‌లో వీటికి బాగా డిమాండ్ ఉందని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నీలవేణి, బాలకృష్ణ, కిరణ్‌కుమార్, మౌనిక, శిల్ప, మహిళా రైతులు పాల్గొన్నారు.

జనం రాక.. ఓపిక లేక

- టీడీపీ రిలే దీక్షలకు స్పందన కరువు
- జనం మద్దతు లేక శిబిరాలను ఎత్తేసిన నాయకులు
- తలకు మించిన భారంగా నిరసన దీక్షలు
- జనాల్లేక వెలవెలబోయిన శిబిరాలు



నరసన్నపేటలో రిలే దీక్షల శిబిరాన్ని ఎత్తేసి, కుర్చీలను టెంట్ హౌస్‌కు పంపిస్తున్న దృశ్యం



ఎచ్చెర్లలో దీక్షా శిబిరాన్ని ఎత్తేసిన ప్రదేశం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : టీడీపీ నాయకుల దీక్షాదక్షత తేలిపోయింది. అధినేతపై ఉన్న అభిమానం స్పష్టమైపోయింది. దీక్షలకు జనం రాక, నిరసనలు చేసే ఓపిక లేక ఆ పార్టీ నాయకులు టెంట్లు ఎత్తేస్తున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు కోసం చేపడుతున్న దీక్షా శిబిరాలు నిర్వహించలేక చేతులెత్తేశారు. అటు ప్రజల నుంచి, ఇటు కేడర్ నుంచి స్పందన లేకపోవడంతో రిలే నిరాహార దీక్షలు చేయడం టీడీపీ నాయకులకు తలకు మించిన భారంగా మారింది. ధనమైతే ఎంతైనా పెట్టగలం గానీ జనాలను తీసుకురాలేకపోతున్నామని వారంటున్నారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ టెంట్‌లు తొలగించి, కుర్చీలు టెంట్ హౌస్‌కు పంపించి తమకున్న భారాన్ని దింపుకున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు జైలుకెళ్లిన దగ్గరి నుంచి టీడీపీ అధిష్టానం ఆ పార్టీ నాయకులకు నిత్యం ఏదో ఒక టాస్క్ ఇస్తూనే ఉంది. చంద్రబాబుకు మద్దతుగా, ప్రజలే మన వెంట ఉన్నట్టుగా బిల్డప్ ఇచ్చే కార్యక్రమాలు చేపట్టాలని ఎప్పటికప్పుడు డైరెక్షన్ ఇస్తోంది. చంద్రబాబు జైలులో ఉన్నంతకాలం ఏదో ఒకటి చేసి సానుభూతి పొందాలని, ఎన్నికల వరకు ఇదే టెంపో కొనసాగించాలన్న కృత నిశ్చయంతో టీడీపీ అధిష్టానం ఉంది. అందుకు తగ్గట్టుగానే కార్యక్రమాలకు రూప కల్పన చేస్తోంది. చంద్రబాబు జైలుకెళ్లిన రోజు, ముందు ధర్నాలు, రాస్తారోకోలు ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. కానీ జనాలు ఎక్కడా స్పందించలేదు. కనీసం సానుభూతి చూపించలేదు. చివరికి పార్టీ కార్యకర్తలు సైతం సీరియస్‌గా స్పందించలేదు. దీంతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం ఓపెన్ అయిపోయారు. 'అధినేత చంద్రబాబు అరెస్టైనా ప్రజల నుంచి స్పందన రావడం లేదు.. పార్టీ శ్రేణులు ముందుకు రావడం లేదు.. ఏంటీ దారుణమైన పరిస్థితి' అని చంద్రబాబు జైలుకెళ్లిన రోజున టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆ పార్టీ నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ఆ తర్వాత చంద్రబాబు కోసం పూజలు, మీతోనే మేము వంటి కార్యక్రమాలు చేపట్టారు. వాటికీ స్పందన లేదు. తర్వాత పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. చంద్రబాబుకు మద్దతుగా ఉన్నట్టు సెంట్రల్ జైలుకు పోస్టు కార్డులు రాసే కార్యక్రమం చేపట్టారు. జనాలు, కార్యకర్తలు ముందుకు రాకపోవడంతో నాయకులే బల్క్‌లో కొనుగోలు చేసి, బల్క్‌లోనే రాసి పంపించేసి మమ అనిపించారు. దీంతో పోస్టు కార్డుల ఉద్యమం అట్టర్ ఫ్లాప్ అయిపోయింది. ఆ తర్వాత రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. చంద్రబాబు బయటికొచ్చేంతవరకు చేపట్టాలని పిలుపునిచ్చారు. కానీ శిబిరాల్లో కూర్చొనేందుకు జనాల్లేక దీక్షలు వెలవెలబోయాయి. గంట, రెండు గంటలు చేసేసి దీక్షలు ముగించేసిన పరిస్థితి కొనసాగింది. ఇప్పుడా గంట, రెండు గంటలు కూడా చేయలేని పరిస్థితికి వచ్చేశారు. దీంతో దీక్షా శిబిరాలు నిర్వహించడం కష్ట సాధ్యంగా తయారైంది. దానికి తోడు మధ్యలో కంచాల మోత మోగించే కార్యక్రమానికి పిలుపునిచ్చారు. నాయకులు తప్ప కార్యకర్తలు, ప్రజలు ఎక్కడా కంచాలు మోగించలేదు. కార్యక్రమం కూడా విఫలమైంది. ఆ తర్వాత ఇంట్లో లైట్లు ఆర్పేసి, కొవ్వొత్తుల వెలిగించాలని అధిష్టానం ఆదేశించింది. అది కూడా ఫ్లాప్ అయ్యింది. నాయకులు తప్ప మరెవ్వరూ కొవ్వొత్తులు వెలిగించలేదు. ఆ నాయకులు వెలిగించిన కొవ్వొత్తుల ఫోటోలనే సోషల్ మీడియాలో పెట్టుకుని తృప్తి చెందారు.



అచ్చెన్నాయుడు సొంత మండలంలోని పార్టీ కార్యాలయం వద్ద దీక్షా శిబిరం ఎత్తేసిన దృశ్యం

జిల్లాలో చాలా నియోజకవర్గాల్లో మంగళవారం రిలే నిరాహార దీక్షా శిబిరాలను ఎత్తేశారు. సాక్షాత్తు పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలోనే రిలే నిరాహార దీక్షలు ఎత్తేశారంటే మిగతా చోట్ల ఏం జరిగి ఉంటుందో ఊహించుకోవచ్చు. నరసన్నపేట, పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల తదితర నియోజకవర్గాల్లో ఇదే దుస్థితి. అధిష్టానం నుంచి కూడా తప్పకుండా చేయాలని ఒత్తిడి లేకపోవడంతో హమ్మయ్య అనుకుని ఊపిరిపీల్చుకున్నారు. ఒక భారం దిగిందని ఉపశమనం పొందారు.

నిరసన కార్యక్రమాలకు దిగుదాం అనుకునే సరికి ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో అతి కష్టం మీద సమీకరించిన ఇరవై ముప్పై మందితో కొన్నిచోట్ల అయితే పది మందికి మించి కార్యక్రమాలు చేపట్టలేని దుస్థితి నెలకొంది. చంద్రబాబు అరెస్టైన దగ్గరి నుంచి ఆ పార్టీ నాయకులకు చేదు అనుభవాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఇలా ఏ కార్యక్రమం చేపడుదామనుకున్నా స్పందన లేక వెలవెలబోతుండటంతో చేసేదేమీ లేక చివరికి రిలే దీక్షా శిబిరాలు కూడా మూసేసే పరిస్థితికి వచ్చేశారు.



కాశీబుగ్గ కేటీ రోడ్డులో రిలే దీక్షల శిబిరం ఎత్తేసిన స్థలం

సయ్యద్ ముస్తాక్ ఆలీ క్రికెట్ టోర్నీలో మన ఆటగాడు

- ఆంధ్రా జట్టుకు ఎంపికైన శ్రీకాకుళం క్రికెటర్ విజయ్
- నిలకడైన ఆటతీరుకు చిరునామా



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన రంజీ ఆటగాడు త్రిపురాన విజయ్ సయ్యద్ ముస్తాక్ ఆలీ క్రికెట్ టోర్నీకి ఎంపికయ్యాడు. జార్ఖండ్‌లోని రాంచీ వేదికగా ఈనెల 16 నుంచి మొదలుకానున్న అంతర్ రాష్ట్రాల టీ-20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి వర్తమానం అందింది. విజయ్ ఎంపికపై జిల్లా క్రికెట్ సంఘ పెద్దలు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా నుంచి ఒకే ఒక్కడు..

ఈ సీజన్‌లో జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ ఆలీ టీ-20 క్రికెట్ టోర్నీకి శ్రీకాకుళం జిల్లా నుంచి ఆంధ్రా జట్టుకు ఎంపికైన ఒకే ఒక్కడు విజయ్. టెక్కలిలోని అయ్యప్ప నగర్‌లో నివాసం ఉంటున్న త్రిపురాన వెంకట కృష్ణరాజు, లావణ్య విజయ్ తల్లిదండ్రులు. తండ్రి సమాచారశాఖలో ఉద్యోగిగా పనిచేస్తుండగా తల్లి గృహిణి. ప్రస్తుతం విజయ్ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు.

బెస్ట్ ఆల్‌రౌండర్‌గా గుర్తింపు..

పాఠశాల దశలో క్రికెట్‌పైన మక్కువతో విజయ్ 2013-14లో మైదానంలో అరంగేట్రం చేశాడు. అంతర్ జిల్లాల నార్త్‌జోన్ అండర్-14 జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రదర్శనతో రాణించడంతో కడప క్రికెట్ అకాడమీకి ఎంపికయ్యాడు. అక్కడ నుంచి వెనుదిరిగి చూడలేదు. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటింగ్‌తోపాటు ఆఫ్‌స్పిన్ మ్యాజిక్‌తో విశేషంగా ఆకట్టుకుంటూ వచ్చాడు. బీసీసీఐ నిర్వహించే ప్రతిష్టాత్మకమైన విజయ్ హజారే ట్రోఫీ సీనియర్ పురుషుల అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు ఆంధ్రా జట్టుకు ఎంపికై, రాణించడంతో పాటు అదే సీజన్‌లో రంజీలకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. 2021-22లో అంతర్‌రాష్ట్ర అండర్-23 క్రికెట్ టోర్నీలో మెరుగ్గా రాణించడంతో బీసీసీఐ నిర్వహిస్తున్న బెంగళూరు నేషనల్ క్రికెట్ అకాడమీకి ఎంపికై శిక్షణ పొందాడు. ఏపీఎల్ టీ-20 క్రికెట్ పోటీల్లో కోస్టల్ రైడర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఆ జట్టు ట్రోఫీ గెలవడంలో ప్రధాన పాత్ర పోషించాడు.

ఐపీఎల్ లక్ష్యం



సయ్యద్ ముస్తాక్ ఆలీ క్రికెట్ టోర్నీకి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. అయితే ఐపీఎల్ టోర్నీకి ఎంపిక కావడమే నా లక్ష్యం. ఐపీఎల్ ద్వారానే ఎంతోమంది క్రీడాకారులు భారత జట్టుకు ఎంపికయ్యారు. నా జీవిత లక్ష్యం జాతీయ జట్టుకు ఆటడమే. అందుకోసం నిరంతరం సాధన చేస్తున్నాను. నన్ను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, కోచ్‌లకు, సంఘ పెద్దలకు కృతజ్ఞతలు.

– విజయ్, రంజీ ప్లేయర్

డిజి లాకర్ వినియోగంపై అవగాహన



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఆర్ఐఓ దుర్గారావు

సారవకోట: విద్యార్థులు డిజి లాకర్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్మీడియెట్ బోర్డు రీజనల్ ప్రాంతీయ పరిశీలకులు దుర్గారావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మంగళవారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిజి లాకర్ ఉపయోగాలు, విద్యార్థులు సర్టిఫికెట్లు ఎలా భద్రపరచుకోవాలో వివరించారు. జిల్లాలో 21,141 మంది విద్యార్థులకు ద్వితీయ సంవత్సర ధ్రువీకరణ పత్రాలు వచ్చాయని, వాటిని ఆయా కళాశాలలకు వెళ్లి తీసుకోవాలన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 255 అడ్మిషన్లు పెరిగాయని, రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీని కోసం ప్రతి కళాశాలలో 4గంటల నుంచి 5వరకు స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. తాను నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రస్తుతం ఆర్ఐఓగా విధులు నిర్వర్తిస్తున్నానని, తాను చదువుకున్న రోజుల్లో గణిత ఉపాధ్యాయుడిని ఆదర్శంగా తీసుకుని చదువు పై దృష్టి సారించానన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు చదువులో రాణించేందుకు దృష్టి సారించాలని, దీని కోసం ఎవరినైనా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపల్ విశ్వప్రసాద్, లెక్చరర్లు పలువురు ఉన్నారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడిపై దృష్టి

- విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ

రణస్థలం, శ్రీకాకుళం క్రైమ్, జలుమూరు: జిల్లాలో గంజాయి సాగు ఎక్కడా లేదని, ఒడిశా ప్రాంతాల నుంచి అక్రమంగా వస్తోందని, ఈ అక్రమ రవాణాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌లో ఆయన మంగళవారం వార్షిక తనిఖీలు చేపట్టి మాట్లాడారు. పాతపట్నం, పురుషోత్తపురం, పలాస ప్రాంతాల్లో చెక్ పోస్టులు పెట్టి విస్తృత తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ఒడిశా నుంచి వచ్చే బస్సులు, రైళ్లలో అనుమానిత వ్యక్తులపై నిఘా పెడుతున్నామని తెలిపారు. రాయగడ వైపు నుంచి ఎక్కువగా ఈ అక్రమ రవాణా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రాధిక, డీఎస్పీ శృతి, జేఆర్‌పురం సీఐ ఆదాం, ఎస్ఐ రాజేష్ తదితరులు ఉన్నారు.

శ్రీకాకుళం రూరల్ సర్కిల్ కార్యాలయంలో..

వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ శ్రీకాకుళం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం రాత్రి సందర్శించారు. గౌరవ వందనం స్వీకరించి పోలీసులకు పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జలుమూరు పోలీస్‌స్టేషన్‌ను కూడా సందర్శించారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు.



జేఆర్‌పురం స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, ఎస్పీ రాధిక

'పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తాం'

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ (ఎస్ఎం పురం క్యాంపస్)ను మంగళవారం సందర్శించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వసతి గృహం భవనాలు, అకడమిక్ బ్లాక్, ల్యాబ్‌ల నిర్మాణాల పరిస్థితిపై ఇంజినీరింగ్, స్థానిక అధికారులతో సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న భవనాలను గడువులోగా పూర్తి చేయాలని, సకాలంలో బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం లేకుండా సెమిస్టర్ పరీక్షల నిర్వహణ నాటికి అకడమిక్ క్యాలెండర్ మేరకు క్లాస్‌వర్క్ జరగాలని చెప్పారు. ప్రయోగాలకు సైతం ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

విద్యార్థులు లైబ్రరీ, ఇతర వసతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం మెనూ ప్రకారం పెట్టాలని, నిరంతరం అధికారులు పరిశీలించాలని అన్నారు. విద్యార్థుల నుంచి భోజన నాణ్యతపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వర రావు, ఓఎస్డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.



మెస్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్‌జీయూకేటీ రాష్ట్ర చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఆరోగ్య సురక్షతో ప్రజలకు భరోసా



ఇజ్జాడపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

లావేరు: ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత శిబిరాలను నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విజయగనరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. మండలంలో గోవిందపురం సచివాలయం పరిధిలోని ఇజ్జాడపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వారు మంగళవారం పరిశీలించారు. ఓపీ రికార్డులు, వైద్య సేవలను వారు పరిశీలించారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. లావేరు, మురపాక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జె.మౌనిక, డాక్టరు ఎం.మణిభూషణ్, డాక్టరు జగదీష్, ఆర్థోపెడిక్, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ పి.వంశీ, డాక్టరు వెంకటసుజాత వైద్య సిబ్బంది శిబిరానికి వచ్చిన 226 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, లావేరు పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, గోవిందపురం సర్పంచ్ పిల్లా రాము, ఎంపీటీసీ ఇజ్జాడ రాము తదితరులు పాల్గొన్నారు.



పది రోజుల్లో లక్ష మందికి వైద్యపరీక్షలు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి

కోటబొమ్మాళి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని, పది రోజుల్లో లక్ష మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య శాఖలో రికార్డు నెలకొల్పామని డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. ఆమె మంగళవారం కోటబొమ్మాళి మండలం (కొత్తపేట-2 సచివాలయం)అక్కయ్యవలస గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ సరాసరి 10వేలమంది వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు లక్షల మందికి వైద్యపరీక్షలు చేయగా 1400 మందికి పలు వ్యాధులు ఉన్నట్టు గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా ఎంపిక చేసిన ఆస్పత్రులకు రిఫర్ చేశామన్నారు. జిల్లాలోని 71 పీహెచ్‌సీలు, 7 అర్బన్ పీహెచ్‌సీల్లోని 1085 మంది వైద్య సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతిరోజూ సేవలందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి జనార్దన, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, తిలారు, నిమ్మాడ పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ నీరజ, నితీష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధు, ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్ఓ బి.కూర్మారావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ క్వార్టర్లీ పరీక్షలు



శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్ విద్యార్థులకు కొత్త పంథాలో బుధవారం నుంచి క్వార్టర్లీ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా ఒకే ప్రశ్న పత్రంతో విద్యార్థులు పరీక్షలు రాసేలా నిర్ణయించారు. బుధవారం నుంచి నుంచి మొదలుకానున్న త్రైమాసిక(క్వార్టర్లీ) పరీక్షలతో ఈ విధానం అమల్లోకి వచ్చింది. పరీక్షకు ముందు ప్రశ్నపత్రం కాలేజ్ ప్రిన్సిపాల్‌కు చేరుతుంది. ఐడీ, పాస్‌వర్డు ద్వారా క్వశ్చన్ పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రింటౌట్స్ తీసి, కళాశాలల్లో నిర్దిష్టమైన సమయానికి విద్యార్థులకు అందజేసి పరీక్షలను రాయిస్తారు. సెప్టెంబర్ వరకు పూర్తయిన నిర్దేశిత సిలబస్ ప్రకారం రూపుదిద్దుకున్న ఈ ప్రశ్న పత్రాన్ని ఇంటర్ విద్య అధికారుల పర్యవేక్షణలో నిష్ణాతులైన లెక్చరర్లు పారదర్శకంగా, అత్యంత గోప్యంగా తయారుచేసి రూపొందిస్తున్నారు. ఈ పరీక్షలకు జిల్లా ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు నేతృత్వంలో ఏర్పాట్లు పకడ్బందీగా, పక్కాగా చేపట్టారు.

క్లుప్తంగా

కొత్తమ్మతల్లి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



కొత్తమ్మ తల్లి ఉత్సవాలపై సమీక్ష చేస్తున్న టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమార్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమార్ తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం సబ్‌కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. క్యూలైన్‌లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణపై యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసి తనకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, సర్పంచ్ కాల్ల సంజీవరావు, తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, డీటీ మధు, టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ మహ్మద్ అలి, డీఎల్‌పీఓ ఐవీ రమణ, ఆర్‌అండ్‌బీ డీఈ రమణమూర్తి, జేఈ సరోజ పాల్గొన్నారు.

కని'బెట్'కుని ఉండాలి..!

- జిల్లాలో క్రికెట్ వరల్డ్‌కప్ ఫీవర్
- జోరుగా పందేలు కాస్తున్న బెట్టింగ్ రాయుళ్లు
- ఇంటిలోనూ పర్యవేక్షణ అవసరం
- బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్, రణస్థలం, కాశీబుగ్గ: కంచిలిలో ఓ క్లినిక్‌లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ మొదట్లో బెట్టింగ్‌లో కాస్త డబ్బులు రావడంతో రుచి మరిగాడు. అలా ఆడీఆడీ అప్పుల పాలై అంతా పోగొట్టుకున్నాక మేలుకున్నాడు.
వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన ఓ యువకుడు విజయనగరంలో తల్లిదండ్రులు పంపించిన డబ్బులతో కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతూ ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలో పడి చదువుకు ఉపయోగపడే డబ్బంతా పెట్టేశాడు.
కాశీబుగ్గలో రెండేళ్ల కిందట ఓ యువకుడు.. బెట్టింగ్‌లో లాస్ అయ్యి ఇంట్లో ఏం చెప్పాలో తెలియక చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
బెట్టింగ్ భూతం ఇప్పుడు మళ్లీ నిద్ర లేచింది. వన్‌డే క్రికెట్ వరల్డ్ కప్ మొదలుకావడంతో బెట్టింగ్ రాయుళ్లు మళ్లీ పందేలు కాయడం మొదలుపెట్టారు. అయితే ఇందులో ఎక్కువగా మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వాళ్లే బలైపోతున్నారు. ఎక్కువ డబ్బు వస్తుందని ఆశ పడడం, ఇంటిలో పెద్దగా పర్యవేక్షణ లేకపోవడంతో ఉన్నదంతా బెట్టింగ్‌లు కాస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఇప్పుడు బెట్టింగ్‌లు చాలా మారిపోయాయి. ఇంటిలోనే కూర్చుని ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు కాసే పద్ధతి పెరిగిపోయింది. చేతులు మారే డబ్బుల స్థానే ఆన్‌లైన్ యూపీఐ ట్రాన్‌జెక్షన్లు అవుతున్నాయి. కొన్ని యాప్‌లు కూడా లీగల్‌గా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాయి. వీటి మాయలోపడి సామాన్యులు సమిధలైపోతున్నారు. జిల్లాలోని రణస్థలం, శ్రీకాకుళం, కాశీబుగ్గల్లో బెట్టింగ్ ప్రభావం ఎక్కువగా ఉండగా నరసన్నపేట, ఇచ్ఛాపురం, టెక్కలి, ఆమదాలవలసల్లో ఓ మోస్తరు బెట్టింగ్‌లు జరుగుతున్నాయి.

శ్రీకాకుళం కేంద్రంగా..
జిల్లాకేంద్రంలో గత ఐపీఎల్, టీ–20 వరల్డ్‌కప్ సమయాల్లో రెండు పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలోని దుకాణాలు, లాడ్జీల్లో ఓ సముదాయంగా ఏర్పడి బెట్టింగ్‌లు చేశారు. ప్రధాన బుకీని 2016లో రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఇప్పుడు సాధారణ వ్యక్తుల మాదిరిగా ఆన్‌లైన్ యాప్‌ల్లో ఆడుకుంటున్నారు. శ్రీకాకుళం కేంద్రంగా చేసుకుని శ్రీకూర్మం, అరసవిల్లి, పెద్దరెల్లివీధి, ఫరీదుపేట, పొన్నాడ బ్రిడ్జి సమీపాన బెట్టింగులు ఒకప్పుడు జరిగేవి. ఈ ఏడాది మేలో ఏపీహెచ్‌బీ కాలనీలో పొన్నాడకు చెందిన ఓ వ్యక్తితో పాటు 20 మందిని ఒకటో పట్టణ ఎస్ఐ గణేష్ పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 20 వేలు నగదు, రెండు ఫోన్లు, ఒక ల్యాప్‌ట్యాప్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పరిషత్ సమీపంలో ఒకటో పట్టణ ఎస్ఐ గణేష్ దాడులు జరిపి కేసులు నమోదు చేయడంతో కాస్త తగ్గుముఖం పట్టాయి.

రణస్థలం కేంద్రంగా..
జిల్లాలోని క్రికెట్‌బెట్టింగ్‌లో రణస్థలం ప్రథమ స్థానంలో ఉంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో పైడిభీమవరం, జే.ఆర్.పురం, రణస్థలం, నగరప్పాలెం, కోష్ట, పాతర్లపల్లి, సంచాం, చిలకపాలెం, ఎచ్చెర్ల, కుశాలపురం, మురపాక, లావేరు, వెంకటాపు యువత, మధ్యతరగతి వ్యాపారులు, కంపెనీల్లో పని చేసే రోజువారీ కార్మికులు నిత్యం బెట్టింగ్‌లు కాస్తుంటారు. రోజువారీ కూరగాయలు, పండ్లు, చికెన్ అమ్మే వ్యాపారి నుంచి పెట్రోల్ బంకుల్లో, పరిశ్రమల్లో పనిచేసే యువత, ఉద్యోగం లేక ఖాళీగా ఉండే యువతకు నిత్యం బెట్టింగ్‌లే పనిగా జీవన శైలి మారింది. రణస్థలంలోని ఓ సెల్ దుకాణంలో కొంతమంది వ్యక్తులు యువత, చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు రోజు వారీ అప్పులు ఇచ్చి మరి క్రికెట్ బెట్టింగ్‌లు ప్రోత్సహిస్తున్నారు.

పలాసలో..
పలాస–కాశీబుగ్గ జంటపట్టణాల్లో శివారున ఉన్న హుద్‌హుద్ ఇళ్లు, జాతీయ రహదారి దాటించి రిజర్వ్ ఫారెస్టు క్రికెట్ బెట్టింగ్‌కు అడ్డాగా మారింది. పలాసలోని ఉదయపురం, పురుషోత్తపురానికి చెందిన ఏమీ లేని నిర్వాహకులైతే ఇప్పుడు కోట్లు అర్జిస్తున్నారు. క్రికెట్ ఆడే యువతతో మొదలై, ఆసక్తి గల వారంతా అక్కడకు చేరుతున్నారు. పోలీసుల నిఘా పెరగడంతో దట్టమైన అడవుల్లోకి వెళ్లిపోయి ఆడుతున్నారు. సిగరెట్, మత్తు పానీయాల్లో మునిగితేలుతూ ల్యాప్‌టాప్‌లు పట్టుకుని మరీ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు కడుతున్నారు. పలాసలో రెండేళ్ల కిందట యువకుడు బెట్టింగ్‌లో లాస్ అయిపోయి అప్పుల పాలై ఇంటివద్ద ఏం చెప్పాలో తెలీక ఆత్మహత్య చేసుకున్నాడు.



పలాసలో రహస్యంగా బెట్టింగ్‌లు కాసే హుద్‌హుద్ ఇళ్లు



పలాస జాతీయ రహదారి పక్కన ఉన్న రిజర్వు ఫారెస్టు

ఉక్కుపాదం తప్పదు



బెట్టింగ్ ఆడే వారిపై ముఖ్యంగా నిర్వాహకులపై ఉక్కుపాదం తప్పదు. పటిష్ట నిఘా పెట్టి ఉన్నాం. సరైన సమాచారం వస్తే అదుపులో తీసుకుంటాం. రిపీటెడ్‌గా చేస్తే షీట్స్ ఓపెన్ చేస్తాం. వారి ఫోన్ నంబర్లు, మెయిల్ ఐడీలపై సైబర్ నిఘా ఉంచుతాం. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తమ ఖాతాలున్న ఏటీఎం కార్డులు, ఫోన్‌పే, గూగుల్ పే వంటి యూపీఐ ట్రాంజెక్షన్లు తమకు అవగాహన లేక పిల్లలకు అప్పజెబుతుంటారు. అలాంటప్పుడు వాళ్లు ఇలాంటి బెట్టింగ్‌లకు దుర్వినియోగం చేస్తుంటారు. అప్పుడప్పుడూ బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాలను పరిశీలించాలి. వారు ఎందుకు వాడుతున్నారన్నది గ్రహించాలి. పిల్లలను ఓ కంట కనిపెట్టుకుని ఉండాలి.

– జి.ఆర్.రాధిక, ఎస్పీ, శ్రీకాకుళం జిల్లా

లారీ బోల్తా



పొలాల్లో బోల్తాపడిన లారీ

సారవకోట: మండలంలోని కురిడింగి గ్రామానికి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున సిమ్మెంట్‌తో వస్తున్న లారీ పొలంలోకి వెళ్లి బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి ఒడిశాలోని పర్లాకిమిడి సిమ్మెంట్ బస్తాలతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పొలాలలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. అయితే లారీ డ్రైవర్ హేమంత్ సోయి ప్రమాదాన్ని గుర్తించి గెంతేయడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

28 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది

కంచిలి: కంచిలి జాతీయ రహదారి మీదుగా అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సబ్జి దాబా హోటల్ వద్ద మంగళవారం పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో 60 బ్యాగుల్లో 28 క్వింటాళ్ల బియ్యాన్ని సోంపేటకు చెందిన సానా మనోహర్‌కు చెందినవిగా గుర్తించి, జప్తు చేసి 6ఎ కేసు నమోదు చేశారు. సరుకును కంచిలి ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించారు. ఈ తనిఖీలను విజిలెన్స్ అధికారి రామారావు, సీఎస్‌డీటీ కూర్మారావులు ఉమ్మడిగా నిర్వహించినట్లు తెలిపారు.

సభ్యత్వ నమోదు మార్గదర్శక పత్రాలు ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు మార్గదర్శక కరపత్రాలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మంగళవారం ఆవిష్కరించారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగాలని గ్రామాలు, పట్టణాల పరిధిలో సంబంధిత అధికారుల ద్వారా ఈ సభ్యత్వం చేపడుతున్నారని తెలిపారు. సభ్యత్వం పొందిన వారందరూ కూడా తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. అధిక మొత్తంలో మెంబర్‌షిప్ చేసిన సభ్యులకు కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు ఇస్తామని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం



చెరుకూరి గున్నమ్మ (ఫైల్)

బూర్జ : మండలంలో గల సింగన్నపాలెం గ్రామ వెనుక భాగాన ఉన్న చెరువులో ఓ వృద్ధురాలి మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. స్థానిక పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆమదాలవలస వెంగళరావు కాలనీకి చెందిన చెరుకూరి గున్నమ్మ(60) శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆ రోజు రాత్రి ఉప్పినివలస గ్రామంలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆది, సోమవారాలు ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఇంతలోనే మంగళవారం సింగన్నపాలెం చెరువులో ఆమె మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతురాలికి ముగ్గురు కొడుకులు, ఒక్క కూతురు ఉన్నారు. అందరికీ వివాహమైంది.

గున్నమ్మకు మూడేళ్లుగా మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త చెరుకూరి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్ఈకి సత్కారం



ఎస్ఈ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

అరసవల్లి: జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన నాగిరెడ్డి కృష్ణమూర్తిని జిల్లా వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ నేతలు మంగళవారం ఉదయం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ కృష్ణమూర్తిని ప్రతినిధుల బృందం ఘనంగా సత్కరించింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం చేస్తున్న కృషి, చర్యలను రీజనల్ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఎస్ఈకి వివరించారు. విధి నిర్వహణలో పారదర్శక విధానాలకు తమ సంఘం పూర్తి స్థాయి మద్దతు ఉంటుందని ఎస్ఈకి తెలిపారు. కార్యక్రమంలో సంఘ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీనివాసరాజు, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, సర్కిల్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకటరావు, ఎస్.రాజారావు, పాలకొండ బ్రాంచ్ సెక్రటరీ వి.భరత్ తదితరులు ఉన్నారు.

'వంతెన పనులు ప్రారంభించండి'



వంశధార కాలువపై నిర్మించనున్న వంతెన కోసం గిరిజనులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి

సారవకోట: మండలంలోని బైదలాపురం సమీపంలో వంశధార ఎడమ కాలువపై నిర్మించనున్న వంతెన పనులు త్వరగా ప్రారంభించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి వంశధార అధికారులను సూచించారు. ఆమె మంగళవారం మండలంలోని బైదలాపురం గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వంతెన లేకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ వంతెన నిర్మాణానికి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చొరవతో రూ.1.33 కోట్లను కలెక్టర్ ప్రత్యేకంగా కేటాయించారని, కానీ పనులు ప్రారంభించలేదని గ్రామస్తులు ఆమెకు తెలియజేశారు. దీంతో సంబంధిత ఈఈతో ఆమె ఫోన్‌లో మాట్లాడి వంతెన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు ప్రారంభానికి ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జితేంద్ర మిశ్రో

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ పరిధి మండపాలం కాలనీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలనీకి చెందిన జితేంద్ర మిశ్రో (44) అనే వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండపాలం కాలనీలో నివాసముంటున్న జితేంద్ర మిశ్రో స్థానిక పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి తన ఇంటి వద్ద నుంచి ద్విచక్రవాహనంపై వ్యతిరేక మార్గంలో (రాంగ్ రూట్) తాను పనిచేస్తున్న పెట్రోల్ బంకువైపు వెళ్తుండగా అదే మార్గంలో టెక్కలి నుంచి నందిగాం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో జితేంద్ర మిశ్రోకి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్ఐ ఎల్ రామకృష్ణ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

తొలితరం రాజకీయ నాయకుడు హరికృష్ణ మృతి



కిల్లంశెట్టి హరికృష్ణ(ఫైల్)

మందస: మందస ప్రాంతానికి చెందిన తొలితరం నాయకుడు, మేజరు పంచాయతీ మందస మాజీ సర్పంచ్, శతాధిక వృద్ధుడు కిల్లంశెట్టి హరికృష్ణ(103) మంగళవారం మృతి చెందారు. మంజూష(మందస) సంస్థానం రాజులు, జమీందారుల పాలన అనంతరం జమీందారేతరుల కుటుంబానికి చెందిన హరికృష్ణ మొట్టమొదటిగా మందస సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన ఏకంగా పాతికేళ్ల పాటు సర్పంచ్‌గా సేవలు అందించారు. వందేళ్ల వయస్సులో కూడా అందరినీ పేరు, పేరునా పలకరించి ఆశ్చర్యపరిచేవారు. వైశ్యుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు మజ్జి తులసీదాసు, స్వాతంత్య్ర సమరయోధుడు గౌతు లచ్చన్నలకు ఆయన సన్నిహితులు. చాలాకాలం పాటు తెలుగుదేశం పార్టీలో కొనసాగారు. వృద్ధాప్యం దృష్ట్యా కొన్నేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మందస జమీందారుల పాలనను చూసిన వారిలో ఆయన ఒక్కరే మందసలో ఉన్నారు. హరికృష్ణకు వెంకటేశ్వర రావు(కరువులు), నరేష్ అనే ఇద్దరు కుమారులున్నారు. వెంకటేశ్వరరావు కోవిడ్ సమయంలో మరణించారు. హరికృష్ణ మృతిపై రాజకీయ నాయకులు, కళింగవైశ్య సంఘం నాయకులు అంధవరపు సూరిబాబు, బోయిన గోవిందరాజులు, కోణార్క్ శ్రీను, పొట్నూరు గణేశ్, కోరాడ శ్రీనులతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు. హరికృష్ణ మృతికి సంతాపంగా మందస పట్టణంలోని దుకాణాలను బంద్ చేశారు.

వివాహిత మృతిపై ముమ్మర దర్యాప్తు



పరశురాంపురంలో అశ్విని మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, తహసీల్దార్ సరోజిని



పరశురాంపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ వాసుదేవరావు

మెళియాపుట్టి: ముకుందాపురం పంచాయతీ పరిధిలోని పరశురాంపురం గ్రామానికి చెందిన వివాహిత జన్ని అశ్విని(21) మృతిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. అశ్విని భర్త జన్ని కృష్ణారావు అదనపు కట్నం కోసం తరచూ గొడవ పడుతూ ఉండేవాడని, అత్తమామలు, ఇద్దరు ఆడపడుచులు సైతం బంగారు గొలుసు, ద్విచక్ర వాహనం తీసుకురావాలని వేధిస్తూ ఉండేవారని మృతురాలి తల్లి చీర కాంతమ్మ చెబుతున్నారు. పెళ్లయిన నాటి నుంచి ఎలాంటి సారె సామాన్లు తీసుకురాలేదంటూ ఇబ్బందులకు గురిచేసే వారని, పలుమార్లు ఫోన్ చేసినా అల్లుడు కృష్ణారావు మాట్లాడేవారు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన తర్వాత కూడా పాము కరిచిందని తప్పుడు సమాచారం ఇచ్చారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్ఐ రాజేష్, సీఐ వినోద్‌బాబుతో కలిసి టెక్కలి డీఎస్పీ వాసుదేవరావు పరశురాంపురం గ్రామాన్ని సందర్శించి అశ్విని మృతదేహాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. సూపర్ వాస్మాల్ 33 సీసాలు మృతురాలు బహిర్భూమి కోసం వెళ్లిన చోట దొరికాయని తెలిపారు. తహసీల్దార్ సరోజిని గ్రామాన్ని సందర్శించి మృతిపై ఆరా తీశారు. మంగళవారం మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టెక్కలి డీఎస్పీ వాసుదేవరావు పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి కాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.